క్లుప్తంగా

వరద బాధితులకు తక్షణ సాయం



చొప్పల్లి గ్రామంలో వరద బాధితులకు బియ్యం అందిస్తున్న దృశ్యం

వీఆర్ పురం: వరద బాధితులకు తక్షణ సహాయం కింద ప్రభుత్వం ద్వారా అందచేసే రూ. 2 వేల నగదు అందజేస్తోందని, రామవరం పంచాయతీ కార్యదర్శి టి.తాతారావు అన్నారు. చొప్పలి గ్రామంలోని వరద బాధితులకు శుక్రవారం నగదుతో పాటు ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, కూరగాయలు అందజేసినట్టు ఆయన చెప్పారు. సచివాలయ కన్వీనర్లు ఆసు లక్ష్మణరావు, మాడి ముత్యాలరావు, నాయకులు సాయిరాం, రాజబాబు, వలంటీర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్‌తో ప్రయాణిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

డుంబ్రిగుడ: ఆటో డ్రైవర్లు పరిమితికి మించిన ప్రయాణికులను తీసుకెళ్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ సంతోష్‌కుమార్ హెచ్చరించారు. అరకు వారపు సంతలో ఆటో డ్రైవర్లతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ మందిని ఎక్కించుకుని ప్రయాణికులను ఇబ్బందులు పెడితే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆటో డ్రైవర్లులందరికీ లైసెన్స్‌లు ఉండాలని లేని పక్షంలో అంటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రయాణికులకు సురక్షితంగా వారి గమ్య స్థానాలకు చేరవేసేలా ఉండాలని సూచించారు. ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు

సీలేరు: సీలేరులో సీఆర్‌పీఎఫ్ జి–42 బెటాలియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మారెమ్మ తల్లి ఆలయానికి వెళ్లే రహదారికి ఇరువైపులా పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ సురేష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. మొక్కల సంరక్షణ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. గ్రామ పెద్దలు శ్రీనివాసు, అప్పారావుతో పాటు ఎస్‌ఐ రామకృష్ణ, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

పాడేరు రూరల్ : పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా ఫేర్‌వేల్ డే నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువును అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించాలని ఆకాక్షించారు. డిగ్రీ విద్యార్థులు విద్య, క్రీడలు, ఎన్ఎస్ఎస్‌లో రంగాల్లో కళాశాలకు మంచి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైస్ ప్రిన్సిపాల్ టి.ఎస్.రసూల్, అధ్యాపకులు రమేష్‌బాబు, మురళీధర్‌రావు, కోటేశ్వరరావు, అశ్వినిరెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన

యలమంచిలి: కృష్ణాపురంలో శుక్రవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఎంపీపీ గోవింద్ ఈ ప్రదర్శనను ప్రారంభించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి రామ్ మోహనరావు లేగ దూడల ఉత్పత్తి పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. పశువైద్యాధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఒరవడి.. పశు విజ్ఞాన బడి



కిలగాడలో పశు విజ్ఞాన బడిలో రైతలకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారిణి సౌజన్యదేవి

- ఆర్‌బీకేల్లో ప్రతి వారం రైతులకు అవగాహన తరగతులు
- పాడిపశువుల పెంపకానికి ప్రోత్సాహం

ముంచంగిపుట్టు: వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమ బలోపేతానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుంది.ఇందులో భాగంగా పాడిరైతులకు అనేక రాయితీలు అందిస్తోంది. పొలంబడి మాదిరిగా పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రతీ నెలా పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా పాడిరైతులకు పశు పోషణ, సంరక్షణపై పశుసంవర్ధకశాఖ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా గొర్రెలు, మేకలు సంరక్షణ కోసం ప్రత్యేక కార్యక్రమాలు సైతం చేస్తున్నారు.

పాడి రైతులకు సూచనలు

మండలాల్లో విధులు నిర్వహిస్తున్న పశువైద్యాధికారులు వారి పరిధిలో 20 మంది పాడి రైతులను ఎంపిక చేసుకొని,వారికి పశుపోషణ,చూడి పశువుల సంరక్షణ,పశుగ్రాసాల సేద్యం,దాణా తయారీ,పశు సంవర్ధకశాఖ ద్వారా ప్రభుత్వం అందించే పథకాలు,రాయితీలు,ఇతర ప్రయోజనాలపై అవగాహన కల్పించేలా పశు విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నారు.ఆర్‌బీకేల్లో ఉన్న టీవీల్లో, లేని పలు గ్రామాల్లో రైతులకు వద్దకే వెళ్లి ప్రతీ వారం పాడి అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలను అందిస్తూ పశు విజ్ఞాన బడి కార్యక్రమాలు నిర్వహించి పాడి అభివృద్ధిలో రైతుల్లో చైతన్యం కల్పిస్తున్నారు. పశువుల్లో వ్యాపించే సాధారణ, సీజనల్ వ్యాధులు, వాటి లక్షణాలు, నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.పశువైద్యాధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్న పశు విజ్ఞాన బడి ద్వారా తమకు పశువులు, మేకలు, గొర్రెలు పెంపకంపై ఎంతో విలువైన సూచనలు అందుతున్నాయని, ప్రభుత్వం రైతుల మీద చూపుతున్న చొరవకు రైతులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు ఎంతో ప్రయోజనం

పాడి రైతులు,గొర్రెలు,మేకల పెంపకందారుల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు విజ్ఞాన బడి కార్యక్రమం ఎంతో ప్రయోజనకరం.ఆర్‌బీకేల్లో ,గ్రామాల్లో రైతు లకు అవసరైన సలహాలు,సూచనలు అందిస్తున్నాము.రైతులలో నెలకొన్న సందేహాలు తీరుస్తున్నాము.జీవాలకు వచ్చే వ్యాధులపై సైతం అవగాహన కల్పిస్తూ టీకాలు,నట్టల మందుల వినియోగం.వాటి ఆవశ్యకతను వివరిస్తూ రైతలను చైతన్య పరుస్తున్నాము.

– డాక్టర్ ఎం.సౌజన్యదేవి, పశువైద్యాధికారి, కిలగాడ పశువైద్య కేంద్రం, ముంచంగిపుట్టు మండలం

ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యం



నెల్లిమెట్లలో గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- గ్రామాల్లో గడపగడపకు విశేష స్పందన
- సమస్యల పరిష్కారానికి హామీ

రాజవొమ్మంగి: పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని నెల్లిమెట్ల, మొల్లిమెట్ల, సీతారాంపురం గ్రామాల్లో శుక్రవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 300 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి యోగ క్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ మాట్లాడుతు అడవినే నమ్ముకొని బతుకుతున్న 44 గిరిజన కుటుంబాలకు కొండ పోడు భూములపై ప్రభుత్వం హక్కులు కల్పించడం హర్షణీయమన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సచివాలయ వ్యవస్థ వల్ల ప్రజలకు ఎంత మేలు జరుగుతుందన్నారు. పారదర్శకంగా పార్టీలకతీతంగా ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందజేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలువురు రైతు భరోసా, అమ్మఒడి, మ్యూటేషన్లు తదితర సమస్యలను వివరించగా, సంబంధిత అధికారులను పిలిచి సత్వరమే సమస్య పరిష్కరించా లని ఎమ్మెల్యే ఆదేశించారు. అర్హులైన వారి పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను గ్రామస్తులకు ఎమ్మెల్యే ధనలక్ష్మి అందజేశారు.

ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, వైస్ ఎంపీపీ చప్పా చంద్రరాణి, మండల పార్టీ కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, సర్పంచ్‌లు మిరియాల సత్యవతి, మిరియాల గణలక్ష్మి, కొంగర మురళీకృష్ణ, ఆపూరి శుభలక్ష్మి, సవిరెల చంద్రుడు, తొంటా ఆదిరాజు, ఎంపీటీసీ సభ్యురాలు గంగదుర్గ, నాయకులు బొడ్డు వెంకటరమణ, అంజిబాబు, ముసలయ్య, దుర్గాప్రసాద్, ఎంపీడీఓ యాదగిరీశ్వర రావు, డీటీ సత్యనారాయణ, ఏపీఎం ఆదినారాయణ, ఎంఈవో సూరారెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ సురేష్ కుమార్, ఉపాధి జేఈ శ్రీనివాస్, ఎస్‌ఐ గోపీ నరేంద్రప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహాలు



మాట్లాడుతున్న మండల పార్టీ కన్వీనర్ గోపాల్

వీఆర్ పురం: అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ద్వారా ఇంటి పట్టా ఇవ్వడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పొడియం గోపాల్ అన్నారు. పోలవరం ముంపు గ్రామం చొక్కనపల్లిలో పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ముంపు 41.15 కాంటూరు పరిధిలోని కొల్లూరు, కొండేపూడి, పోచవరం, తుమ్మిలేరు, చొక్కనపల్లి గ్రామస్తులకు ఏలూరు జిల్లా రామన్నగుడెంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలలోని గృహాలను అధికారులు కేటాయించినట్టు తెలిపారు. నిర్వాసితులందరికీ ప్రభుత్వం న్యాయం చేస్తోందని, ఆదుకుంటుందన్నారు. వాటికి సంబంధించిన పట్టాలను ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబుల చేతుల మీదుగా త్వరలో అందజేయనున్నట్టు పేర్కొన్నారు. అలాగే నిర్వాసితులకు ఇంకా ఏమైన సమస్యలు ఉన్నా వారి దృష్టికి తీసుకువెళితే పరిష్కరిచడం జరుగుతుందన్నారు.

సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ బొడ్డు సత్యనారాయణ,ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానీటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, నాయకుడు సత్తిబాబు, వెంగళరావు, వెంకటేశ్వర్లు, లక్ష్మణరావు, ప్రశాంత్, సాయి, వెంకమ్మ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

వై.రామవరం: మండలంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శనివారం పర్యటించనున్నట్టు ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలోని పూతిగుంట గ్రామంలో మధ్యాహ్నం 2గంటలకు రైతులకు సబ్సిడీపై పామాయిల్ మొక్కలు పంపిణీ చేస్తారన్నారు.అనంతరం చవిటిదిబ్బలు సచివాలయం పరిధిలోని పూతిగుంట, తోటకూరపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, జేసీఎస్ ఇన్‌చార్జిలు హాజరుకావాలని వారు కోరారు.

రైతులకు అండగా ప్రభుత్వం



రైతులకు రుణాలు అందజేస్తున్న ఎంపీపీ రమేష్, పక్కన పర్సన్ ఇన్‌చార్జి సూరిబాబు

కొయ్యూరు: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీపీ బడుగు రమేష్‌బాబు అన్నారు. కొయ్యూరు ప్రాథమిక సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రూ.3.7లక్షల రుణాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. సకాంలో రుణాలు అందజేస్తోందన్నారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. రైతులపైనే పీఏసీఎస్‌లు ఆధారపడి ఉన్నాయన్నారు. పట్టా కలిగిన ప్రతీ రైతు కూడా పీఏసీఎస్‌లో విధిగా సభ్యత్వం కలిగి ఉండాలని కోరారు. రానున్న రోజుల్లో రైతులకు మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సుమర్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల



వట్టిగెడ్డ రిజర్వాయర్ వద్ద పూజలు చేసి సాగునీరు విడుదల చేస్తున్న రైతులు

రాజవొమ్మంగి: మండలం అప్పలరాజుపేట గ్రామంలోని వట్టిగెడ్డ రిజర్వాయర్ నుంచి శుక్రవారం సాగునీరు విడుదలైంది. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు చీడిపల్లి అప్పారావు ఆధ్వర్యంలో రైతులు రిజర్వాయర్ ప్రధాన షట్టర్ వద్ద పసుపు కుంకుమలు అద్ది, కొబ్బరికాయలు కొట్టి సాగునీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం ఈ రిజర్వాయర్ పూర్తి జలాలతో కళకళలాడుతోంది. ఐదు కిలోమీటర్ల నిడివిగల ఈ రిజర్వాయర్ పంట కాలువ ద్వారా ఐదు గ్రామాల్లోని సుమారు 3వేల ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందనుంది. ప్రస్తుతం ముమ్మరంగా ఖరీఫ్ నాట్లు పనులు జరుగుతున్న నేపథ్యంలో సాగునీరు విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. రైతులు, లస్కర్ నజీముల్లా తదతరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల్లో తనిఖీలు



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో సీతయ్య

కొయ్యూరు: మండలంలోని రావణాపల్లి, ఎం.మాకవరం గ్రామాల్లో సచివాలయాలను ఎంపీడీవో లాలం సీతయ్య శుక్రవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది విధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలకు స్థానికంగా అన్ని సౌకర్యాలు అందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పాలన వికేంద్రీకరణకు శ్రీకా రం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా సచివాలయ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. సిబ్బంది పనితీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పారిశుధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ శారధ

డుంబ్రిగుడ: పరిశుభ్రతతోనే వ్యాధుల నుంచి దూరంగా ఉంటామని అరకు సర్పంచ్ శారద అన్నారు. అరకు సంతబయలు గ్రామాల్లో ఆమె శుక్రవారం సందర్శించారు. వీధులను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి చెత్త లేకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అందరి సహాకారంతోనే పరిశుభ్రత సాధ్యపడుతుందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు రాకుండా చూడవచ్చన్నారు. దోమల నివారణకు అందరూ జాగ్రతలు పాటించాలని ప్రజలకు వివరించారు. కండ్ల కలకలు ఎక్కువగా సోకుతున్నాయని, ఇది ఒక వైరస్ లాంటిదన్నారు. భయపడాల్సిన పనిలేదని, అందరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వైద్యుల సూచనాల మేరకు జాగ్రతలు పాటిస్తే సరిపోతుందన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



పనసలపాలెంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్న మహిళా పోలీసు లోవకుమారి

వై.రామవరం: మహిళా చట్టాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పనసల పాలెం గ్రామ సచివాలయ మహిళా పోలీసు లోవకుమారి అన్నారు. సీఐ వై.రాంబాబు ఆదేశాల మేరకు మండలంలోని పనసలపాలెం గ్రామంలో ఆమె పర్యటించి, గ్రామ మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహహింస, వరకట్న నిషేధచట్టం, బాల్యవివాహాలను అరికట్టడం, తదితర మహిళా చట్టాలపై అవగాహనతో పాటు దిశ యాప్‌ను ఉపయోగించే విధానాన్ని వివరించారు. సారాకు జోలికి వెళ్లొద్దన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహలు చట్టరీత్యా నేరమన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా చూడాలని సూచించారు. పోక్సో తదితర మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ రోలిపల్లి నరసింహరావు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు



ధనలక్ష్మి (ఫైల్)

డుంబ్రిగుడ: మండలంలోని అరకు పంచాయతీ నేరేడివలస గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ కొర్రా నాగేశ్వరరావు కుమార్తె కొర్రా ధనలక్ష్మి (17) కనిపించడం లేదని శుక్రవారం డుంబ్రిగుడ ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌కు తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఈ నెల జూలై 11 సాయంత్రం 6 గంటల నుంచి బాలిక కనిపించడం లేదని ఫిర్యాదు చేశారని దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ కోసం గాలిస్తామన్నారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు 6303136054, 6303436054 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



నేరేడివలసలో గర్భిణులకు పోషకాహారం కిట్లు అందజేస్తున్న సర్పంచ్ వెంకటరావు

డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ డుంబ్రిగుడ, బల్లుగుడ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ టేక్ హోమ్ కిట్‌లను సర్పంచ్ వెంకటరావు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు,బాలింతలు, చిన్నారులకు రక్తహీనత సమస్య లేకుండా ప్రభుత్వం అందిస్తున్న బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆస్పత్రుల్లోనే గర్భిణులు ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



యార్లగడ్డ పోషకాహార కిట్లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

వై.రామవరం: మండలంలోని యార్లగడ్డ గ్రామంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు.అంగన్‌వాడీ టీచర్ కడబాల సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ పల్లాల పద్మావతి, మండల జేసీఎస్ కన్వీనర్ కరణం కనకరాజు, సచివాలయ కన్వీనర్ దాగేరి గంగరాజు, గృహసారథులు జ్యోతి, రాజ్యలక్ష్మి పాల్గొని గర్భిణలకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



నీటి నిల్వలను పరిశీలిస్తున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్య

చింతపల్లి: జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య శుక్రవారం పర్యటించారు. నీటి నిల్వ ఉన్న ప్రదేశాలను పరిశీలించి, వాటి వల్ల కలిగే అనర్థాలను స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ వ్యాధుల పట్ల గిరిజనులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మురుగు నీటి నిల్వ ద్వారా దోమలు వృద్ధి చెందుతాయని, ఫలితంగా మలేరియా, డెంగ్యూ రోగాలు ప్రబలుతాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీడీవో ఆశాజ్యోతి, సర్పంచ్ దురియా పుష్పలత, ఆర్.వి.నగర్ వైద్యాధికారి మహేష్, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, సీలేరు సబ్ యూనిట్ అధికారి కన్నబాబు, ఎమ్‌టీఎస్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

అనాథ శరణాలయానికి వితరణ



అనాథ శరణాలయానికి వంటపాత్రలు అందజేస్తున్న కొట్టగుల్లి సింహాచలంనాయుడు, ఇతర సభ్యులు

సాక్షి, పాడేరు: స్థానిక గుడివాడలోని అనాథ శరణాలయానికి విలువైన వంట సామగ్రితో పాటు పుస్తకాలను పాత పాడేరుకు చెందిన వర్తకుడు మధుమతి రాము సమకూర్చారు. ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడుతో పాటు ఆధ్మాత్మిక కమిటీ ప్రతినిధులు ఉప్పల వెంకటరత్నం, సిద్దనాతి కొండలరావు, కొట్టగుల్లి పోతురాజులు శుక్రవారం అనాథ శరణాలయం నిర్వహకులకు అందజేశారు.చిన్నారులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

రోలుగుంట: ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రసాద్ తెలిపారు. ఏపీ సార్వత్రిక విద్యా పీఠం నిబంధనల మేరకు పదో తరగతిలో చేరేందుకు 2021 ఆగస్టు 31వ తేదీకి 14 ఏళ్లు నిండి ఉండాలన్నారు. ఇంటర్లో చేరేందుకు పదో తరగతి పూర్తయి, 2022 ఆగస్టు 31వ తేదీకి 15 ఏళ్లు నిండిన వారు అర్హులన్నారు. ఈ నెల 31వ తేదీలోగా పదో తరగతికి రూ.100, ఇంటర్‌కు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. మిరిన్ని వివరాలకు తమ పాఠశాల సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

సాగునీటి కల్పనకు కృషి



గరుడాపల్లిలో చెక్‌డ్యామ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం

హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ వై.గరుడాపల్లి, కామయ్యపేట గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం శుక్రవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో సాగు, తాగునీటి సమస్యను స్థానికులు తెలియజేశారు. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ జెడ్పీ నిధులతో తాగునీటి సౌకర్యం కల్పిస్తామని, ఉన్నతాధికారులతో మాట్లాడి సాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో చెక్‌డ్యామ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు.తన సొంత నిధులతో చెక్‌డ్యామ్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ పాంగి రామారావు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ర్యాలీ



ర్యాలీలో మాట్లాడుతున్న పాస్టర్లు తదితరులు

చింతపల్లిరూరల్: మణిపూర్ ఘటనను నిరసిస్తూ మండల కేంద్రంలోని సెయింటాన్స్ పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పాస్టర్లు శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవ కుటుంబాలకు రక్షణ కల్పించాలన్నారు.మణిపూర్ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జరిగిన సంఘటనలకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పాస్టర్లు ఈనాక్, ప్రభాకర్, డేవిడ్ రాజ్, తిమోతి, సెంటిస్స్ పాఠశాల సిస్టర్స్, ముస్లిం సోదరులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు పరిహారం



మాట్లాడుతున్న బీజేపీ నేత రాజారావు

చింతూరు: మండల కేంద్రంలోని ఎస్టీ, బీసీ కాలనీల్లో బీజేపీ నాయకులు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు మాట్లాడుతూ చింతూరు, నిమ్మలగూడెం గ్రామాల చుట్టూ వరద నీరు చేరినా, అధికారులు వారికి పరిహారం అందించలేదన్నారు. అధికారులు స్పందించి బాధిత కుటుంబాలకు పరిహారం అందించాలని కోరారు. నేతలు వెంకయ్య, రమణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, కొండల్‌దొర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.